సాక్షి
కాకినాడ
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



మేధస్సు పెంపునకు నాంది

'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్ బీ సెమీ ఫైనల్స్ పరీక్షలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.




కాలువలోకి దూసుకుపోయిన కారు

రాజవరం – పొదురాడ రోడ్డులో ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద ఆదివారం ఉదయం ఓ కారు అదుపు తప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయింది.

8లో

9,745 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 9,745 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులుగా ఉంది.



న్యూస్‌రీల్

ఏపీఎస్‌టీఏ జిల్లా కార్యవర్గం



శరత్‌చంద్ర



రాఘవులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా వెంకటేశ్వరరావు ఆదివారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మూలపేట జెడ్పీ హైస్కూల్ గణితోపాధ్యాయుడు పి.శరత్ చంద్ర, ప్రధాన కార్యదర్శిగా బూరుగుపూడి జెడ్పీ హైస్కూల్ గణితోపాధ్యాయుడు ఎం.రాఘవులు నియమితులయ్యారు. వారిని పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా ఉపాధ్యాయ సమస్యలపై పోరాడతామని, సభ్యత్వాల పెంపుదలకు కృషి చేస్తామని చెప్పారు.

లోవకు పోటెత్తిన భక్తులు

తుని: తలుపుమ్మ తల్లి లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సుమారు 6 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. ప్రసాదం విక్రయాల ద్వారా రూ.96,762, పూజా టికెట్ల ద్వారా రూ.32,330, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.4,200, వాహన పూజ టికెట్ల ద్వారా రూ.4,900, కాటేజీల ద్వారా రూ.41,082, విరాళాల ద్వారా రూ.69,762 కలిపి మొత్తం రూ.2,48,949 ఆదాయం వచ్చిందని వివరించారు.

నేడు పీజీఆర్‌ఎస్

కాకినాడ సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకూ జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి ఆయా మండలాల అధికారులు తప్పనిసరిగా ఉదయం 9.30 గంటలకే హాజరు కావాలని పేర్కొన్నారు.

నాచు మొక్కలు, కేజ్ కల్చర్‌కు హోప్ ఐలాండ్ అనుకూలం

కాకినాడ రూరల్: సముద్ర జలాల్లో నాచు మొక్కల పెంపకం (సీ వీడ్ కల్చర్), పంజరాల్లో చేపల పెంపకానికి (సముద్రపు కేజ్ కల్చర్) హోప్ ఐలాండ్ పరిసరాలు అనుకూలంగా ఉన్నట్టు గుర్తించామని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలా శంకర్ తెలిపారు. హోప్ ఐలాండ్ వద్ద దీనికి అనుకూలమైన ప్రాంతాలను కాకినాడకు చెందిన మత్స్యకారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సముద్రంలో పెంచే నాచు మొక్కలకు డిమాండ్ ఉందన్నారు, ఆక్వాకల్చర్ ఆహారం ఐటమ్‌లు నాచుతో తయారు చేసే క్యాప్సూల్స్ తీసుకుంటారని తెలిపారు. కేజ్ కల్చర్ ద్వారా అనుకూలమైన చేపలను పంజరాల్లో పెంచవచ్చన్నారు. దీనిపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మత్స్యశాఖ కమిషనర్‌తో పాటు మెరైన్ జేడీ పి.సురేష్, ఆక్వా ఫిషరీస్ జేడీ లాల్ మహమ్మద్, ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ సుమలత, మత్స్యశాఖ జేడీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర దడలు

నానాటికీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు వంటింట్లో సెగలు పుట్టిస్తున్నాయి. కూరగాయల రేట్లు వింటేనే సామాన్య ప్రజానీకం బెంబేలెత్తిపోతోంది.. కొనకుండానే ఉల్లి ధర కన్నీరు పెట్టిస్తోంది.. ఉప్పు నుంచి పప్పు వరకూ ప్రతి వస్తువు ధరా కొండెక్కి కూర్చుంది.. చుక్కలు చూస్తున్న ధరలతో జనం విలవిలలాడుతున్నారు.. ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో పెరుగుతున్న ధరలకు కళ్లెం వేయాల్సిన ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోంది.

- తారాజువ్వల్లా దూసుకెళ్తున్న కూరగాయల రేట్లు
- కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి
- తగ్గేదేలే.. అంటున్న పప్పులు
- కొండెక్కిన కోడిగుడ్ల రేటు
- మరిగించకుండానే మంట పుట్టిస్తున్న నూనెలు
- పెరిగిన ధరలతో జనం విలవిల
- పట్టించుకోని ప్రభుత్వం

కాకినాడ సిటీ: కొద్ది రోజులుగా మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు భగ్గుమంటున్నాయి. ఆరేడు నెలల క్రితం వరకూ స్థిరంగా ఉన్న ధరలు.. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ.. పట్టపగ్గాలు లేకుండా పెరుగుతూ.. వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. కొండెక్కిన ధరలు దిగి రాకపోవడంతో సామాన్యులపై పెనుభారమే పడుతోంది. ఇప్పటికే పంటలు సరిగ్గా పండక రైతులు, కూలీలు.. కూటమి పాలనలో సంక్షేమ పథకాలు అందక పేదలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో.. పులి మీద పుట్రలా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతూండటంతో జనం గగ్గోలు పెడుతున్నారు. వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలూ చేపట్టకపోవడంతో విలవిలలాడుతున్నారు.

కూరగాయాలు

మార్కెట్‌లో కూరగాయల ధరలను చూసి సామాన్యుడు బెంబేలెత్తుతున్న పరిస్థితి. టమాటా, వంగ, బీర, బంగాళాదుంప వంటి కూరగాయల రేట్లు కిలోకు రూ.50 పైనే పలుకుతున్నాయి. క్యాప్సికం, ఆకాకర వంటి వాటి రేట్లు రూ.80 నుంచి రూ.120 వరకూ చెబుతున్నారు. ఇతర కూరగాయల రేట్లు కూడా వింటేనే హడలు పుడుతున్న పరిస్థితి. ఆకుకూరలు కూడా గతంలో రూ.10కి రెండుమూడు కట్టలు ఇచ్చేవారు. ఇప్పుడు వాటి ధర రూ.20కి పెరిగింది.

ఉల్లికిపాట్లు

ఇక ప్రతి ఒక్కరూ వినియోగించే ఉల్లి ధర మామూలుగా లేదు. ఉల్లిపాయ కోస్తే కాదు.. కొంటేనే వినియోగదారులకు కన్నీళ్లు వస్తున్న పరిస్థితి. ఆరు నెలల కిందట కిలో ఉల్లిపాయ ధర రూ.30 కాగా, ఇప్పుడు ఏకంగా రూ.80కి పెరిగింది. ఆరుడల లేకుండా కాస్త నాసిరకమైతే రూ.60 వరకూ చెబుతున్నారు.





ఇక రోజుకి కంటే వెల్లుల్లి ధర ఏకంగా 7 రెట్లు అధికంగా పలుకుతోంది. ఆరు నెలల కిందట కిలో వెల్లుల్లి ధర రూ.200 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.560కి ఎగబాకింది. ఏ కూర వండాలన్నా ఉల్లి, వెల్లుల్లి లేకపోతే రుచి ఉండదని, అందువల్లనే ఎంత ధర పలికినా కొనుగోలు చేయక తప్పడం లేదని వినియోగదారులు వాపోతున్నారు.

నూనెల సలసల

ఇక నూనెల ధరలదీ అదే రూటు. ఆరు నెలల క్రితం లీటరు పామాయిల్ రూ.85 కాగా.. ప్రస్తుతం రూ.140కి చేరింది. సన్‌ఫ్లవర్ నూనె ధరలు రూ.115 నుంచి రూ.150, వేరుశనగ నూనె రేటు రూ.160 నుంచి ఏకంగా రూ.230కి పెరిగింది. వంట నూనెల్లో కేంద్ర ప్రభుత్వం 20 శాతం దిగుమతి సుంకాన్ని విధించడంతో వీటి రేట్లకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కుదించిన వంట నూనెపై గతంలో ఉన్న 12.5 శాతం సుంకాన్ని కేంద్రం ఏకంగా 32.5 శాతానికి పెంచింది. దీంతో లీటరుపై రూ.35 నుంచి రూ.50 వరకూ ధర పెరిగింది. వంటనూనెపై సుంకం పెంపును కూటమిలోని పార్టీ నాయకులు వ్యతిరేకించకపోవడంతో.. ఆ భారమంతా వినియోగదారులపై పడుతోంది.

స్పందించని ప్రభుత్వం

ధరలు పెరిగినప్పుడు మార్కెట్ రేట్ల కంటే తక్కువకు విక్రయించేందుకు ప్రభుత్వాలు సాధారణంగా ఏర్పాట్లు చేస్తాయి. తద్వారా ధరలకు కళ్లెం వేస్తాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇదేవిధంగా ఏర్పాట్లు చేసేవారు. టమాటా, ఉల్లి వంటివి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల ద్వారా తక్కువ ధరకే ప్రజలకు అందించేవారు. లభ్యత ఎక్కువ ఉన్న ప్రాంతాల నుంచి ఆయా సరుకులు ప్రత్యేకంగా రప్పించి, ప్రజలకు అందుబాటులో ఉంచేవారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు మండిపోతున్నా కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూండటంపై వినియోగదారులు మండిపడుతున్నారు.

ధరలు అదుపు చేయాలి



పెరిగిన ఉల్లి ధరలు నాలుగు నెలలుగా తగ్గడం లేదు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అన్ని రకాల నిత్యావసర వస్తువులు అందుబాటులో లేకుండా పోతున్నాయి. పెరిగిన ధరలు దిగిరాకపోవడంతో అంత వ్యయం భరించలేక వినియోగదారులు విలవిలలాడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యావసరాలు, కూరగాయల ధరలను అదుపు చేయాలి.

– పోలనాటి ప్రభాకరమూర్తి, వినియోగదారుడు, కాకినాడ



హాస్టల్ విద్యార్థులకు కష్టమే..

కూరగాయలు, కోడిగుడ్లు, ఇతర నిత్యావసరాల ధరల అమాంతం కొండెక్కడంతో సంక్షేమ హాస్టల్ వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం నెల తరబడి బిల్లులు మంజూరు చేయకపోవడంతో వారు అప్పులతో నెట్టుకొస్తున్నారు. నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరగడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోందని వాపోతున్నారు. ధరలు తక్కువగా ఉన్న సమయంలోనే విద్యార్థులకు చిన్న సైజు గుడ్లు అందించేవారు. ఇప్పుడు రేట్లు పెరగడంతో ఆ చిన్న గుడ్లు కూడా అందకుండా పోతాయేమోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

గుడ్డు తేలేసేలా..



ఇక కోడిగుడ్డు ధర గతంలో ఎన్నడూ లేని విధంగా పెరిగింది. పౌష్టికాహారం కావడంతో ఎక్కువ మంది గుడ్డును ఉపయోగిస్తున్నారు. బేకరీ ఫుడ్స్, నూడిల్స్ స్టాల్స్, రెస్టారెంట్లలో వీటి వినియోగం ఎక్కువగా ఉంది. గత ఆగస్టులో రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు ధర రూ.5.70 ఉండగా ఇప్పుడు రూ.7.50కు పెరిగింది. వంద గుడ్ల ధర క్రితం 30 గుడ్ల ట్రే ధర రూ.130 ఉండగా నేడు రూ.210 పలుకుతోంది. కూరగాయలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా కొండెక్కడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం, మండపేట, రాయవరం, ఆలమూరు, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. ఉత్పత్తి తగ్గినందువల్లనే కోడిగుడ్డు ధరలు పెరిగిపోతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

నాటు కోడిగుడ్డు సెపరేటు

పారం గుడ్లే కాకుండా నాటు కోడి గుడ్డును కూడా మార్కెట్లో విక్రయిస్తున్నారు. గతంలో ఇది ఒక్కొక్కటి రూ.10కి లభించేది. ఇప్పుడు రూ.15 నుంచి రూ.20 వరకూ పలుకుతోంది. పారాల్లో గుడ్ల ధరలు అమాంతం పెరిగిపోవడంతో నాటుకోడి గుడ్ల ధరలను కూడా వ్యాపారులు నానాటికీ పెంచేస్తున్నారు.

నిత్యావసరాల ధరలు కిలోకు రూ.లలో	
కందిపప్పు	169.00 – 180.00
పొట్టు మినపప్పు	135.00
పెసరపప్పు	120.00
వేరుశనగ గుళ్ల	140.00
పెసలు	125.00
మినప గుళ్ల	148.00
బ్రాండెడ్ మినపగుళ్ల	240.00
శనగపప్పు	98.00
బెల్లం	74.00
ఇడ్లీ రవ్వ	40.00
చింతపండు	155.00
శనగలు	95.00
ఎండుమిర్చి	260.00
ధనియాలు	210.00
జీలకర్ర	375.00
పామాయిల్ (లీటర్)	140.00
వేరుశనగ నూనె (లీటర్)	260.00
కోడిగుడ్డు (ఒక్కొక్కటి)	7.50
నాటు కోడిగుడ్డు	15.00 – 20.00

కూరగాయల ధరలు కిలోకు రూ.లలో	
టమాటా	48.00
వంకాయ	50.00
చిక్కుడు	40.00
బీరకాయ	60.00
దొండకాయలు	56.00
బంగాళాదుంపలు	50.00
బీట్‌రూట్	60.00
బీన్స్ గింజలు	160.00
ఆకాకర	120.00
క్యాప్సికం	80.00
కొత్త ఉల్లిపాయలు	55.00
పాత ఉల్లిపాయలు	80.00
క్యారెట్	45.00
వెల్లుల్లి	560.00

మాంసాహారానిదీ అదే రూటు

మాంసాహారం ధరలు కూడా పెరుగుతున్నాయి. గతంలో కిలో చికెన్ రూ.160 నుంచి రూ.180 మధ్య లభించేది. ఇప్పుడు రూ.210 నుంచి రూ.220 వరకూ పలుకుతోంది. ఇక కిలో మటన్ రూ.వెయ్యి వరకూ ఉంది.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై కొలువైన వీరవేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావడంతో ఉదయం నుంచే భక్తుల రద్దీ ఆరంభమైంది. సత్యదేవుని ఆలయం, ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శని వారం రాత్రి రత్నగిరిపై రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధువులు, ఇతర భక్తులు వేలాదిగా తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వ్రతాలు రెండు వేల జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి నిత్యాన్నదాన పథకంలో 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు.

కన్నుల పండువగా రథోత్సవం

ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు రథాన్ని తూర్పు రాజగోపురం ముందుకు తీసుకువచ్చారు. ఆ రథంపై స్వామి, అమ్మవార్ల విగ్రహాలను వేంచేయించి, పూజలు చేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు రథోత్సవాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో రథోత్సవం నిర్వహించారు.



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పవన్ కల్యాణ్ ప్రగల్భాలు ఆపాలి

- మన్యంలో నేటికీ డోలీ మోతలే
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పెద్దాపురం: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రగల్భాలు పలకడం ఆపాలని, మన్యం పర్యటన పేరుతో దాంబికాలు మినహా ఆయన వల్ల, రాష్ట్ర ప్రభుత్వం వల్ల గిరిపుత్రులకు ఒరిగేదేమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం జిల్లా మహాసభల్లో పాల్గొన్న ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డోలీ మోతలపై చర్యలు తీసుకుంటామని నాలుగు నెలల క్రితం ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలిసిందా ? అని ప్రశ్నించారు. గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం రోజు మన్యం వెళ్లి ఉంటానని, డోలీ మోతలు లేని ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటాయామని పవన్ కల్యాణ్ ప్రకటించారన్నారు. కానీ, ఇప్పటికీ మన్యంలో డోలీ మోతలు మినహా కనీసం అభివృద్ధి అయినా జరగలేదని అన్నారు. వైద్యం, విద్యా హామీలతో పాటు ఆదివాసీలకు కీలకమైన భూ సమస్యను పవన్ కల్యాణ్ విస్మరించారన్నారు. మన్యంలో గ్రామసభ అనుమతులు లేకుండా మైనింగ్, జలవిద్యుత్ ప్రాజెక్టులకు, అదానీ కంపెనీలకు భూములను ధారాదత్తం చేసే విధానాలను పవన్ కల్యాణ్ ఎలా రేకెత్తిస్తారా అని ప్రశ్నించారు. తమ్ముడు విద్యుత్ ఒప్పందాలను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే రూ.16 వేల కోట్ల విద్యుత్ భారాలు వేసిన కూటమి ప్రభుత్వం మరోసారి భారాలు మోపేందుకు సిద్ధంగా ఉందని దుయ్యబట్టారు. మీరు వేసే విద్యుత్ భారాలను ప్రజలు ఎందుకు భరించాలని ఆయన ప్రశ్నించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పంట భూముల్లో ఎయిర్‌పోర్టు వద్దు

కాకినాడ సెజ్‌లో సుమారు 650 ఎకరాల ప్రభుత్వ భూమి నేటికీ ఖాళీగా ఉందని, వాటిలో పరిశ్రమలు పెట్టవచ్చని, అటువంటి భూములను ప్రభుత్వం ఎందుకు చేపట్టడం లేదని శ్రీనివాసరావు ప్రశ్నించారు. అన్నవరం వద్ద మూడు పంటలు పుష్కలంగా పండే భూములను విమానాశ్రయం కోసం రైతుల వద్ద తీసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటువంటి ప్రయత్నాలు విరమించుకుని, పంటలు పండని సాల్ట్ భూముల్లో ఎయిర్‌పోర్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. తమ భవిష్యత్తే దెబ్బ తింటుందని రైతులు ఆందోళన చేస్తున్న చోట భూములు ఎందుకు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పంటలు పండే భూమిని రైతుల అనుమతి లేకుండా తీసుకునే వీలు లేదని స్పష్టం చేశారు. రైతులకు అభివృద్ధి, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వచ్చే విధంగా పరిశ్రమలు తీసుకురావాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, మండల కన్వీనర్ డి.క్రాంతి కుమార్, నాయకులు నీలపాల సూరిబాబు, నిరిపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారానికి కాలయాతన

- నేటికీ అందని మత్స్యకార భరోసా
- వాయిదాలు వేస్తున్న కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 23,458 మంది లబ్ధిదారులు
- సీఎం చంద్రబాబు రావాలంటూ జాప్యం
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా అందజేత

సాక్షి, అమలాపురం: 'అయ్యవారు వచ్చే వరకూ అమావాస్య ఆగాల్సిందే' అన్నట్టు ఓఎన్జీసీ సంస్థ మత్స్యకారులకు అందించే నష్ట పరిహారం పంపిణీ తీరు ఉంది. సంస్థ అందించే నష్ట పరిహారంతో పాటు వేట నిషేధ సమయంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకారులకు ఇచ్చే మత్స్యకార భరోసాను సైతం ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెడుతోంది. చంద్రబాబు రావాలి.. పరిహారం ఇవ్వాలి.. బాబు రావాలి.. భరోసా ఇవ్వాలి అంటూ జిల్లాకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులు, అధికారులు వాయిదాల మంత్రం జపిస్తున్నారు.

చమురు సంస్థల కార్యకలాపాలతో నష్టపోయే ఆక్వేరు ప్రక్రియలకు క్రమం తప్పకుండా నష్ట పరిహారం.. మత్స్యకార భరోసా నేటికీ అందలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు కావొస్తున్నా పరిహారం పంపిణీ తేదీపై ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన చేయలేదు. గత నవంబర్ 21వ తేదీన మత్స్యకార దినోత్సవం సందర్భంగా ఓఎన్జీసీ పరిహారంతో పాటు మత్స్యకార భరోసా అందజేస్తారని లబ్ధిదారులు ఎదురు చూశారు. బాబు వస్తేనే పరిహారం అందజేస్తారని కూటమి ప్రజాప్రతినిధులు సైతం చెప్పుకొచ్చారు. ఆ తేదీ వెళ్లిపోయి రోజులు గడుస్తున్నా పరిహారం ఎప్పుడు పంపిణీ చేస్తారనేది మాత్రం తేల్చలేదు. జిల్లాలో కాట్రేనికోన మండలం బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధి గోదావరి పాయపై ఓఎన్జీసీ చమురు సంస్థ చేపట్టిన పైపులైన్ పనులతో స్థానిక మత్స్యకారులు వేట కోల్పోవాల్సి వచ్చింది. ఓఎన్జీసీ సంస్థ సముద్రం లోపల ఉన్న రిగ్గు (ఆఫ్‌షోర్ బావి) నుంచి గాడిమొగ సైట్ వరకూ బ్రహ్మసమేధ్యం సమీపంలో గోదావరి పాయలో పైపులైన్ పనులు చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా పెద్ద ఎత్తున డ్రెడ్జింగ్ నిర్వహించింది. దీనివల్ల నెల పాటు వేటకు అంతరాయం ఏర్పడింది. కాట్రేనికోన మండలంలో పాటు ఐ.పోలవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, కె.గంగవరం మండలాలతో పాటు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన గోదావరి నది పాయలను ఆనుకుని జీవనోపాధి కోల్పోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి పాయల్లో మత్స్య సంపద ఉత్పత్తి లేక ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారు. చేపలు వేట లేకపోవడం, వేట సమయంలో ప్రభుత్వం చెల్లించే మత్స్యకార భరోసా, ఓఎన్జీసీ నష్టపరిహారం చెల్లించక పోవడంతో ఉపాధి కోసం ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమకు రావాల్సిన ఓఎన్జీసీ నష్ట పరిహారం చెల్లించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

వేట లేక.. ఉపాధి దొరకక

చమురు సంస్థలు సముద్ర జలాలు, గోదావరి పాయల్లో చేపడుతున్న చమురు నిక్షేపాల వెలికితీత పనులు, చమురు వ్యర్థాలను విడుదల చేయడం, ఓడల రాకపోకలతో జరుగుతున్న కట్ట కాలుష్యంతో మత్స్య సంపద తగ్గిపోయింది. గౌతమి, వృద్ధ గౌతమి పాయల్లో ఆయా చమురు సంస్థలు చేపట్టిన పైపులైన్ పనులతో ఇసుక మేటలు వేయడం, నదీ ప్రవాహం సక్రమంగా లేకపోవడంతో గోదావరి సహజత్వం కోల్పోయి మత్స్య సంపద తగ్గిపోయింది. చేపల వేట లేక మత్స్యకారుల వేటకు అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగా ఓఎన్జీసీ సంస్థ తమ కార్యకలాపాలు ముగిసే వరకూ నష్టపోయిన మత్స్యకారులకు పరిహారం అందించేందుకు ముందుకు వచ్చింది. ఇందుకు సంబంధించి జిల్లాలో 23,458 మంది మత్స్యకారులకు పరిహారం అందించాలి. ఒక్కో మత్స్యకారునికి రోజుకు రూ.460 చొప్పున నెలలో 25 రోజులకు రూ.11,500 ఇచ్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఓఎన్జీసీ అంగీకరించింది. ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పుదుచ్చేరి రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, మత్స్యకార నాయకులతో జిల్లా కలెక్టర్ సమక్షంలో బాధిత లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఓఎన్జీసీ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి ముమ్మిడివరం, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారులను గుర్తించారు.



నదీ పాయలో వేట లేక వర్ర భూముల్లో సామూహికంగా చేపలు వేటాడుతున్న మత్స్యకారులు

కోనసీమ జిల్లా పరిధిలో 16,408 మంది, కాకినాడ జిల్లా, పుదుచ్చేరి యానాం పరిధిలో 7,050 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డీబీటీ పద్ధతిలో బటన్ నొక్కి ఐదు విడతలుగా ఒక్కొక్కరికి రూ.2,76,000 చొప్పున రూ.647.44 కోట్లను 8 వేల మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. సుమారుగా సంస్థ నుంచి తొమ్మిది నెలలకు పైబడి నష్ట పరిహారం లబ్ధిదారులకు రావాల్సి ఉండగా బాధిత లబ్ధిదారులు చెబుతున్నారు. ఆ సంస్థ మాత్రం కేవలం ఐదు నెల 21 రోజులకు నష్ట పరిహారం జిల్లా కలెక్టర్ వద్ద ఉందని, ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు చెల్లిస్తామని చెబుతోంది. ఇలా దూసిన వేట నష్టపోయిన మత్స్యకారులకు రూ.157.54 కోట్ల పరిహారం అందించాలి. అయితే తేదీలు మారుస్తూ ప్రభుత్వం దాగుడు మూతలు ఆడుతుండటం ఆనవాయితీగా వస్తుండటంతో వాయిదాల బాధిత లబ్ధిదారులకు లబోదిబోమంటున్నారు.

నాలుగు నుంచి ఆరు నెలల్లోపు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా చమురు సంస్థల పరిహారం మత్స్యకారులకు అందేది. కేవలం నాలుగు నుంచి ఆరు నెలల మధ్యలోనే పరిహారం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేవారు. మొత్తం ఐదు దఫాలుగా పరిహారం అందజేయగా

భరోసా ఎక్కడ?

సముద్ర వేట నిషేధ సమయంలో జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేట కోల్పోయిన మత్స్యకార కుటుంబానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించింది. 2023–24 ఏడాదికి గాను 9,821 మందికి రూ.9,82,10,000 నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 2024–25 సంవత్సరానికి గాను 11,305 మంది లబ్ధిదారులను గుర్తించింది. ఎన్నికల సమయంలో మత్స్యకార భరోసాను రూ.20 వేలకు పెంచుతానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ విధంగా చూస్తే ఈ ఏడాది మత్స్యకార భరోసా రూ.22.61 కోట్లు అందించాల్సి ఉంది.

ఉపాధి కోల్పోతున్నాం



గోదావరిలో పైపులైన్ పనులతో ఏర్పడిన ఇసుక మేటలు తొలగించక మత్స్య సంపద తగ్గిపోయింది. పైపులు వేసిన తరువాత పూడ్చివేత పనులు చేపట్టడం లేదు. మత్స్య సంపదపై ఇది కూడా ప్రభావం చూపుతుంది. చేపల వేట లేకపోవడంతో ఉపాధి లేకుండా పోయింది.

–సంగాని చిన్న కన్నయ్య, బ్రహ్మసమేధ్యం, కాట్రేనికోన మండలం

మేము ఎలా బతికేది ?



మాకు ఓఎన్జీసీ సంస్థ నుంచి రావాల్సిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలి. ఆ పరిహారం చెల్లించక, చేపల వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ఇవ్వాల్సిన మత్స్యకార భరోసా సకాలంలో ఇవ్వక పోవడంతో ప్రస్తుతం అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుంది.

–ఓలేటి తేజ, బలుసుతిప్ప, కాట్రేనికోన మండలం

మొదటి మూడు దఫాల్లో ఒక్కొక్కరికి రూ.46 వేల చొప్పున నాలుగు నెలలకు, చివరి రెండు సార్లు రూ.69 వేల చొప్పున ఆరు నెలలకు చెల్లించారు. మొత్తం 9,251 మందికి రూ.2,55,32,76,000 అందజేయడం గమనార్హం.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,800
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	11,000 – 11,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం



ధర్మవరంలో ఎలక్ట్రిక్ బైక్ నుంచి వస్తున్న పొగలు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఆదివారం ఎలక్ట్రిక్ బైక్ దగ్ధమైంది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన దేవరపల్లి సత్యనారాయణకు చెందిన ఓ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ బైక్‌పై ధర్మవరానికి చెందిన ఎం.భావనారుషి ప్రత్తిపాడు వస్తున్నారు. ఈలోగా బైక్ నుంచి పొగలు రావడంతో బైక్ నిలుపుదల చేశారు. ఈ లోపు స్థానికులు ప్రత్తిపాడు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కేఎస్ఎన్ మూర్తి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపులోకి తెచ్చారు.

మేధస్సు పెంపునకు నాంది

- ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్ష
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి విద్యార్థుల హాజరు
- పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా ఉందన్న తల్లిదండ్రులు



SAKSHI SPELL Bee 2024-25



'సాక్షి' స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మధురపూడి: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ సెమీ ఫైనల్స్ పరీక్షలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. కోరుకొండ మండలం లారల్ హై గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన ఈ పరీక్షలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల హాజరయ్యారు. చలి తీవ్రంగా ఉన్నా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు తరలి వచ్చారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని తల్లిదండ్రులు పేర్కొన్నారు. స్పెల్‌బీ ద్వారా ఇంగ్లిష్‌లో మంచి పట్టు సాధించడానికి అవకాశం ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేశారు. 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరిగింది. దీనిని నాలుగు కేటగిరీల్లో నిర్వహించగా, 600 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

కేటగిరీలుగా విభజించి..

కేటగిరి–1లో 1, 2, 3, 4 తరగతులకు చెందిన విద్యార్థులు, కేటగిరీ–2లో 3, 4 తరగతులు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతులు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా పరీక్షల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నూతనోత్తేజం తీసుకు రావడానికి అవకాశం ఏర్పడుతోందని అన్నారు. స్పెల్‌బీ నిర్వహించిన 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పరీక్షలను లారల్ హైగ్లోబల్ స్కూల్ డైరెక్టర్, సుంకర రవికుమార్, 'సాక్షి' రీజనల్ మేనేజర్ (అడ్మిన్) ఎస్.రమేష్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ (మార్కెటింగ్) కె.ఉమాశంకర్ పర్యవేక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్పెల్‌బీకి డ్యూక్స్ వేఫీస్ మెయిన్ స్పాన్సరర్‌గా, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ (రాజమహేంద్రవరం) అసోసియేట్ స్పాన్సరర్‌గా వ్యవహరిస్తున్నాయి. లారల్ హైగ్లోబల్ పాఠశాల సహకారం అందించింది.

ఇంగ్లిష్ అంటే భయం పోయింది



'సాక్షి' స్పెల్ బీ పరీక్ష రాయడం ద్వారా ఇంగ్లిష్ భాష అంటే భయం పోయింది. పలకడం, రాయడం సులభతరం అయ్యింది. ఇక నుంచి సులభంగా ఇంగ్లిషులో రాణించడానికి అవకాశం ఏర్పడింది. ఈ పరీక్ష రాయడంతో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.

– మీనాక్షి హరిప్రియ, 2వ తరగతి, ఆదిత్య అకాడమీ, శ్రీనగర్, కాకినాడ

చాలా విషయాలు తెలుసుకున్నా..



'సాక్షి' స్పెల్ బీ పరీక్ష రాయడం ఆనందంగా ఉంది. మేధస్సు పదును పెట్టేలా దీనిని నిర్వహించారు. ఇంగ్లిషు భాషపై సంపూర్ణ అవగాహన ఏర్పడింది. పోటీ పరీక్షలంటే భయం పోయింది. స్పెల్లింగ్, వ్యాకరణంలో చాలా విషయాలు తెలుసుకున్నాను. ఇది నా భవిష్యత్‌కు బాటలు వేస్తుంది.

– మరోతు లలిత, 6వ తరగతి, ట్రిప్ ఇంటర్నేషనల్, రాజమహేంద్రవరం

ఒకాబ్యులరీపై మంచి అవగాహన



ఇంగ్లిష భాషలో ఒకాబ్యులరీ పట్ల సంపూర్ణ అవగాహన ముఖ్యం. ఇది 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష ద్వారా అవగతం చేసుకున్నాను. పరీక్ష ద్వారా ప్రాక్టీసు అయ్యాను. స్పెల్లింగ్, వర్డ్స్ పట్ల అవగాహన కలిగింది. ఇది ఉపయుక్తంగా ఉంది.

– నిషాంత్ పట్నాలు, 7వ తరగతి, లారల్ హైగ్లోబల్ స్కూల్, గాడాల

విదేశీ విద్యకు ఉపయుక్తం



విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి 'సాక్షి' స్పెల్‌బీ పరీక్ష బాట వేస్తోంది. ఇంగ్లిష్‌లో స్పెల్లింగ్, ఒకాబ్యులరీ చాలా ముఖ్యం. దీనిని నేర్చుకోవడానికి ఈ పరీక్ష దోహదపడుతోంది. పరీక్ష బాగా రాశాను. దీనివల్ల ఎంతో ఉత్సాహం వచ్చింది. విదేశాలకు వెళ్లాలనే నా కోరిక నెరవేరుతోందని ఆశిస్తున్నాను.

– కె.సరోజిరెడ్డి, 7వ తరగతి, ప్రతిభ స్కూల్, జంగారెడ్డిగూడెం

రాణించేందుకు మంచి అవకాశం



విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేలా 'సాక్షి' స్పెల్ బీ పరీక్ష ఉంది. పోటీ పరీక్షల్లో రాణించడానికి ఇదో మంచి మార్గం. ఈ పరీక్షతో అనేక అంశాలు తెలుసుకున్నాను. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే అనేక పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపడానికి మార్గం సుగమమైంది.

– ఆదిమూలం దేవి, 9వ తరగతి, ఆదిత్య, అమలాపురం

ఇంగ్లిష్‌పై పట్టు సాధించొచ్చు



'సాక్షి' నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి ఉపయోగపడుతుంది. ఇంగ్లిష్‌లో చాలా ప్రధానమైన స్పెల్లింగ్, వ్యాకరణంపై సంపూర్ణ పట్టు వస్తోంది. తద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతోంది. పోటీ పరీక్షల్లో రాణించడానికి దోహదపడుతోంది.

– సుంకర రవికుమార్, డైరెక్టర్, లారల్ హై గ్లోబల్ పాఠశాల, గాడాల.

నైపుణ్యం పెరుగుతోంది



ఈ పరీక్ష ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతోంది. పిల్లలు ఇంప్రూవ్ కావడానికి ఎంతగానో దోహదపడుతుంది. ఈ పరీక్ష రాయడంతో ఇంగ్లిష్ భాషా నైపుణ్యం సాధించడానికి అవకాశం ఏర్పడింది. విద్యార్థుల మంచి భవిష్యత్‌కు, విదేశాల్లో ఉన్నత చదువుకు వెళ్లడానికి వీలవుతుంది.

– పద్మజ నయిన, విద్యార్థి తల్లి, కాకినాడ

భవిష్యత్తుకు నిర్దేశంగా..



విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించడానికి 'సాక్షి' స్పెల్ బీ పరీక్ష ఉపయోగపడుతుంది. ఇంగ్లిష్ భాషంటే భయం దూరం చేస్తోంది. పోటీతత్వం అలవర్చుతుంది. ఇంగ్లిష్‌లో ఒకాబ్యులరీ చాలా ముఖ్యమైంది. దీనిపై అవగాహన పెరుగుతుంది. ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

– అశోక్, పేరెంట్, దంత వైద్యుడు, జీఎస్ఎల్, రాజమహేంద్రవరం

ముగిసిన రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు



టీటీ పోటీల విజేతతో ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. తొలుత మ్యాచ్‌లను మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, స్పోర్ట్స్ అథారటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ రమణ, ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నేష్ కుమార్‌లు అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీపీ రామచంద్రరావు మాట్లాడుతూ క్రీడలు మానవ మేధస్సును ఉత్తేజంచేసి, దేహాన్ని పటిష్టపరుస్తుందన్నారు. చదువులో కలిగే ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. శాప్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ రమణ మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు, పట్టుదల అలవడతాయన్నారు. అనంతరం విజేతలకు అతిథుల చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ స్కూల్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్, టేబుల్ టెన్నిస్ సంఘ గౌరవ అధ్యక్షుడు రావు చిన్నారావు, అధ్యక్షుడు భాస్కర్‌రామ్, కార్యదర్శి మోహన్‌బాబు, శ్రీప్రకాష్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, పెద్దాపురం, కాకినాడ శాఖల ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకుపోయిన కారు

- యువకుడిని రక్షించిన స్థానికులు
- 12 రోజుల వ్యవధిలో రెండో ప్రమాదం



కారు నుంచి యువకుడిని రక్షిస్తున్న స్థానికులు



బైక్ ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

పి.గన్నవరం: రాజవరం – పొదలాడ రోడ్డులో ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద ఆదివారం ఉదయం ఓ కారు అదుపు తప్పి ప్రధాన పంట కాలువలోకి దూసుకుపోయింది. నీటిలో కొట్టుకుపోతున్న కారు నుంచి డ్రైవర్‌ను స్థానిక యువకులు రక్షించారు. ఈ నెల 10వ తేదీ తెల్లవారు జామున ఇదే ప్రాంతంలో కాలువలోకి కారు దూసుకుపోయిన ప్రమాదంలో పోతవరం గ్రామానికి చెందిన తల్లీ, ఇద్దరు కుమారులు మృతి చెందిన సంఘటన మరువక ముందే.. సరిగ్గా అక్కడే మరో ప్రమాదం జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన 24 ఏళ్ల యువకుడు పోచనపెద్ది సాయి ఆదివారం ఉదయం కారులో రావులపాలెం వచ్చాడు. అక్కడి నుంచి కడలి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. చింతావారిపేటకు వచ్చే సరికి ఆ కారు అదుపు తప్పి రోడ్డు వెంబడి ఉన్న పంట కాలువలోకి దూసుకుపోయింది. దీంతో కారు ముందు భాగం నీట మునిగి ప్రవాహానికి కొట్టుకుపోతోంది. ఆ యువకుడు కారు డిక్కీని ఓపెన్ చేసి వెనుక సీట్లో నుంచి బయటకు వచ్చే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. దీనిని గమనించిన స్థానిక యువకులు హుటాహుటిన కాలువలోకి దిగి కారులో ఉన్న యువకుడిని రక్షించారు. కారును తాళ్లతో స్తంభానికి కట్టారు. రోడ్డుపై ఉన్న రాయిని ముందు టైరు ఎక్కడంతో కారు అదుపు తప్పిందని సాయి చెప్పాడు. అతడు సురక్షితంగా బయటపడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆర్‌పీ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువ వైపు రెయిలింగ్స్ ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

అక్కడే మరో ప్రమాదం

పంట కాలువలో కారు ప్రమాద సంఘటనను తిలకిస్తూ.. ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొని ఒక మోటారు సైక్లిస్టు తీవ్ర గాయాల పాలయ్యాడు. కైకరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, బాలుడు కలిసి మోటారు సైకిల్‌పై పి.గన్నవరం వైపు వస్తున్నారు. చింతావారిపేట వద్ద కారు ప్రమాద సంఘటనను వారు చూస్తూ ముందు వెళ్తున్న మరో మోటారు సైకిల్‌ను ఢీకొట్టారు. దీంతో కైకరం గ్రామానికి చెందిన వ్యక్తి తలకు హెల్మెట్ ఉన్నప్పటికీ తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోటారు సైకిల్ వెనుక కూర్చుని ఉన్న బాలుడు సురక్షితంగా బయటపడ్డాడు. వారి వివరాలు తెలియాల్సి ఉంది.

సాయం చేసి గెలిపించండి

ఓ క్రీడాకారుడి వేడుకోలు



వివిధ టోర్నమెంట్లలో పతకాలు సాధించిన కొండే అనిల్‌కుమార్

తాళ్లపూడి: ఆట అతని ముందుకు తీసుకెళ్తుంటే.. ఆర్థిక భారం వెనక్కి నెట్టేస్తోంది.. సాయం కోసం ఆ క్రీడాకారుడు వేచిచూడాల్సి పరిస్థితి ఎదురైంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన కొండే అనిల్‌కుమార్‌కు చిన్నతనం నుంచి క్రికెట్ అంటే ప్రాణం. అదే అతన్ని ఆ క్రీడల్లో ప్రతిభ చాటేలా చేసింది. ఇదిలా ఉంటే పేదరికం కారణంగా ఆర్థిక వనరులు లేక ఇబ్బంది పడుతున్నాడు. ప్రస్తుతం ప్రతిష్ఠాత్మక ఇండో నేపాల్ టెన్నిస్‌బాల్ క్రికెట్ సిరీస్‌లో ఆడే అవకాశం తూర్పుగోదావరి జిల్లా నుంచి కొండే అనిల్‌కుమార్‌కు దక్కింది. ఈ నెల 30 నుంచి జనవరి 1 వరకూ జరిగే ఈ క్రికెట్ సిరీస్‌కు హాజరయ్యేందుకు రూ. 3 లక్షల వరకూ అవసరం అని అనిల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 29న ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్ వెళ్లి టీమ్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అనేక పతకాలను సాధించాడు. అయితే ఇండియా తరఫున ఆడేందుకు ఎంపికైన అనిల్ కుమార్‌కు ఏపీ టెన్నిస్ బాల్ అసోసియేషన్ నుంచి రూ. లక్ష సమకూరుస్తున్నారు. కాగా ఆర్థిక స్థోమత లేని అనిల్ మిగతా సాయానికి దాతల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం తిరుగుడుమెట్ట పాఠశాలలో పీఈటీగా ఆయన పనిచేస్తున్నారు. తనకు ఆర్థికంగా సహకారం అందిస్తే తప్పని సరిగా విజయం సాధించి రాష్ట్రం, జిల్లా, మండలం, సొంత గ్రామానికి మంచి పేరు తీసుకువస్తానని అంటున్నారు. నేషనల్ పోటీలకు ఎంపికైన అనిల్‌ను పలువురు అభినందించారు.

వెళ్దాం లే.. సునీతా!

- భార్య మృతదేహం వద్ద భర్త కన్నీరు
- భార్యాభర్తల బంధాన్ని విడదీసిన రోడ్డు ప్రమాదం



సునీత మృతదేహం వద్ద భర్త రవికుమార్ రోదన



గాయపడిన రవికుమార్

ప్రత్తిపాడు: లే సునీత.. వెళ్దాం.. నీవు లేకపోతే నేనుండలేను అంటూ భార్య మృతదేహం వద్ద ఆ భర్త ఆక్రందన అందరినీ కలచివేసింది.. ఈ హృదయ విదారక ఘటన ప్రత్తిపాడు జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద జరిగింది. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం ఆనందనగర్‌కు చెందిన వరిగొండ రవికుమార్ పౌరోహిత్యం చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆయన తన భార్య సునీత (45)తో కలసి స్కూటీపై ప్రత్తిపాడు వస్తున్నారు. వీరి వాహనాన్ని స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి వద్ద లంపకలోవ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో సునీత తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన రవికుమార్ ఏం జరిగిందో తెలియక కొంత సేపు అయోమయానికి గురయ్యాడు. అంతటి గాయాలైనా రోడ్డుపై పడి ఉన్న భార్య చెంతకు వెళ్లి లే సునీత..వెళ్దాం అని మాట్లాడడం అక్కడి వారిని కలచివేసింది. తీవ్ర గాయాల పాలైన రవికుమార్‌ను చికిత్స నిమిత్తం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకెళ్లారు. సునీత మృత దేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పెవరిది... శిక్షెవరికి!

- మేనేజర్ అవినీతి, అధికారుల నిర్లక్ష్యం
- పండగ వేళ జీజీహెచ్ ఉద్యోగులకు పస్తులు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో శాంక్షన్ పోస్టుల్లో చోటు చేసుకున్న అవినీతి వ్యవహారం వందల కుటుంబాల్ని పస్తులుండేలా చేస్తోంది. లేని పోస్టుల్ని సృష్టించి మరీ అమ్మేసిన ఘనకార్యంలో బాధ్యుడైన, నర్సింగ్ పోస్టుల అమ్మకాల్లో ఇప్పటికే సస్పెండైన ఆసుపత్రి మేనేజర్‌పై తదుపరి చర్యలకు అధికారులు పూనుకుంటుండగా, ఈ అవినీతి మాటున అమాయక ఉద్యోగులు బలైపోయారు. 2021 ఏడాది శాంక్షన్ పోస్టుల భర్తీ కేంద్రంగా జరిగిన ఈ అవినీతిలో 12 పోస్టులు లంచాలు పుచ్చుకొని అమ్మేసినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఇదే రిక్రూట్‌మెంట్‌లో నియమితులై పనిచేస్తున్న 190 మందిలో ఈ 12 మంది ఉన్నారన్న కారణంతో ఏకబికిన 190 మంది జీతాలూ నిలిపేశారు. ఇందులో 30 మంది కాంట్రాక్టు బేసిక్, 160 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. గత నెల జీతాలు ఈ నెల 1వ తేదీ నాటికే జమ కావాల్సి ఉంది. రెండో నెల పూర్తి కావొస్తున్నా నేటికీ జమ కాలేదు. ఉద్యోగుల జీతాలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఇప్పటికే ఏపీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ బృందం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం కలెక్టర్‌ను కలసి జీతాలు విడుదల చేయాలని విన్నవించాలని నిర్ణయించారు. అయితే ఖజానా శాఖ అవరోహణ క్రమంలో ఉద్యోగుల జాబితా తయారు చేసి అనర్హులను వేరు చేసి ఇస్తే మిగిలిన వారికి జీతాల బిల్ పెడతామని తద్వారా జీతాల ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పినా ఆసుపత్రి అధికారుల్లో మాత్రం స్పందన లేదు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆ మాత్రం జాబితాను తయారు చేయలేకపోయారు. ఈ విషయంపై కలెక్టర్ షణ్మోహన్‌ను వివరణ కోరగా తన వద్దకు నేటికీ జీతాల విడుదలకు సంబంధించి ఎటువంటి నోట్ ఫైల్ జీజీహెచ్ నుంచి రాలేదన్నారు.

పంట కాలువలో పడి మహిళ మృతి

పి.గన్నవరం: నెల రోజుల కిందట భర్త చనిపోవడంతో బెంగతో ఉన్న ఓ మహిళ ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి మృతి చెందింది. ఈ నెల 19న ఇంటి నుంచి అదృశ్యమైన ఆ మహిళ ఆదివారం మొండెపు లంక లంక వద్ద పంట కాలువలో శవమై తేలింది. ఎస్సై బి.శివకృష్ణ కథనం ప్రకారం.. పి.గన్నవరం గ్రామానికి చెందిన దొంగ చిరంజీవి (54) భర్త ఆనందరావు నెల రోజుల క్రితం గుండెపోటుతో మరణించాడు. అప్పటి నుంచి ఆమె దిగులుతో ఉంటోంది. ఈ నెల 19న ఆమె ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. మొండెపులంక వద్ద ప్రధాన పంట కాలువలో ఆదివారం ఆమె లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

గోవులను తరలిస్తున్న లారీ సీజ్

కొత్తపల్లి: కత్తిపూడి బైపాస్ రోడ్డులో గొల్లప్రోలు మండలం చెందుర్తి జంక్షన్ వద్ద శనివారం అర్ధరాత్రి గోవులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అందులో 32 గోవులను గుర్తించారు. ఈ లారీ విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వెళ్తుంది. లారీని సీజ్ చేసి, గోవులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు: బలభద్రపురం గ్రామానికి చెందిన గొందాల సూర్యనారాయణ (73) శనివారం రాత్రి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. విశాఖపట్నం వైపు వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు ఆదివారం తెలిపారు.